నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 15 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలలో ఎమర్జెన్సీ పాలన

ఏడాదిలో జరిగిన ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

- ఎన్నికల హామీలన్నీ నెరవేర్చండి
- మంచిర్యాల-అంతర్గాం బ్రిడ్జిని నిర్మించాలి
- ఎల్లంపల్లి నిర్వాసితులకు పరిహారమివ్వాలి
- ఆలయాల పక్కన శ్మశాన వాటిక నిర్మించడం సరికాదు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 14: అటు రాష్ట్రంలో.. ఇటు మంచిర్యాల నియోజకవర్గంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తున్నదని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు విమర్శించారు. శనివారం మంచిర్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీ విధించారని, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైందని గుర్తుచేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నారన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో ఏడాదికాలంలో జరిగిన ఘటనలు, చేసిన తప్పిదాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో 60 మందిపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపించారని, అధికారం శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలన్నారు. మంచిర్యాల-అంతర్గాం బ్రిడ్జి నిర్మాణాన్ని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలని, మంచిర్యాల అన్నా ఇక్కడి ప్రజలు అన్నా ఆయనకు ఇష్టం లేకనే ఇలాంటి పనులు చేస్తున్నాడని మండిపడ్డారు. తాను గెలవగానే ఎల్లంపల్లి నిర్వాసితులకు పరిహారం ఇప్పిస్తానన్న పీఏ స్సార్ ఇప్పటి వరకు ఎందుకు ఇప్పించలేదని ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారెంటీలు, 420 హామీలను ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు గద్దెనెక్కిన తర్వాత వాటి అమలును మరిచిపోయారని, వాటిన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి, ఆసరా పింఛన్లు, తులం బంగారం, కేసీఆర్ కిట్లు, రైతుబంధు, రుణ మాఫీ, వడ్లకు బోనస్, నిరుద్యోగులకు రూ 10 వేలు, విద్యార్థినులకు స్కూటీల రూపేణా ఒక్క మంచిర్యాల నియోజకవర్గంలోనే రూ. 550 కోట్లు లబ్దిదారులకు బకాయి పడ్డారని తెలిపారు. రూ. 83 కోట్లతో 10 వేల ఎకరాలకు సాగునీరందించే పడ్తనపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభించాలని డిమాండ్‌చేశారు. మంచిర్యాలలో శ్మశాన వాటికను కట్టడానికి తాను వ్యతిరేకం కాదని, అయితే ప్రేమ్‌సాగర్‌రావు వ్యవహరించే తీరు ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నదన్నారు. గౌతమేశ్వరాలయం, సమ్మక్క సారలమ్మ గద్దెలు, జమ్మి చెట్టు ఉన్న వైపున శ్మశాన వాటికను కడుతున్నారని, దీంతో శ్మశానవాటిక నుంచి వెలువడే పొగ ఆలయాల మీదుగా వెళ్తుందని, ఇది సరైనది కాదని సూచించారు. శివరాత్రి, పుష్కరాలు, ఇతర పండగుల సందర్భంగా వేలాదిమంది పుణ్యస్నానాలు ఆచరిస్తారని, అందుకే కుడి భాగాన కాకుంగా ఎడమవైపున నిర్మించాలన్నారు. ఇప్పటికే దాతలు కొనిచ్చిన స్థలం ఉన్నదని, ఎకరం మూడు గుంటల స్థలాన్ని రూ. కోటీ 20 లక్షలతో కొనుగోలు చేశామని, ఇప్పటికే దాతలు ఇచ్చిన విరాళాలను నేరుగా భూమి యజమానికే అందించడం జరిగిందన్నారు. ఈ భూమిలో శ్మశాన వాటిక నిర్మిస్తే బాగుంటుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూపొందించిన అభివృద్ధి పనులను అడ్డుకున్నారని, మంచిర్యాల, నస్పూరు మున్సిపాలిటీల్లో డీఎంఎఫ్‌టీ నిధులతో 600 కరెంటు స్తంభాలను వేయాలని చూస్తే వాటిని రద్దు చేశారని, సీడీపీ నిధులతో చేపట్టే పనులు కాకుండా చేస్తున్నారని ఆరోపించారు. తనపై, తన కుమారునిపై తప్పుడు ఆరోపణలు చేశారని, అవి నిజమైతే గూడెం ఆలయంలో ప్రమాణం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదెసత్యం, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అంకం నరేశ్, నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, తోట తిరుపతి, ఎర్రం తిరుపతి, శ్రీపతివాసు, వంగ తిరుపతి, తాజుద్దీన్, పడాల రవీందర్, కర్రు శంకర్, మొగిలి శ్రీనివాస్, కాటం రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొన్న కేజీబీవీ టీచర్లు

కోటపల్లి కేజీబీవీలో విద్యార్థుతో మండల విద్యాధికారి(ఫైల్)

కేజీబీవీల్లో బోధనకు బ్రేక్

సమస్యలు పరిష్కరించాలంటూ సమ్మెబాట పట్టిన సమగ్ర శిక్షా ఉద్యోగులు

- వారానికిపైగా నిలిచిన తరగతుల నిర్వహణ
- అర్బన్ రెసిడెన్షియల్స్‌లోనూ ఇదే పరిస్థితి
- సమీపిస్తున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షలు
- ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- సర్కారు దిగి వచ్చే వరకూ పోరాటం ఆగదంటున్న ఉపాధ్యాయులు

కోటపల్లి, డిసెంబర్ 14 : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీలు)లు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యా బోధన నిలిచిపోయింది. సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెబాట పట్టగా, పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల్లో ఆందోళన నెలకొన్నది. పరీక్షలు సమీపిస్తున్న వేళ తరగతుల నిర్వహణ లేకపోవడంతో ఫలితాలు సాధించేదెట్లా అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పది, ఇంటర్ ఫలితాలపై ప్రభావం

మంచిర్యాల జిల్లాలో కస్తూర్బా గాంధీ విద్యాలయాలతో పాటు అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లు 18 ఉన్నాయి. వీటిలో 5320 విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు సమ్మె బాట పట్టగా, వారినికి పైగా తరగతులు సాగడం లేదు. ప్రస్తుతం ఎంఈవోలు పాఠశాలలను పర్యవేక్షిస్తుండగా, విద్యార్థుల రక్షణ చర్యల్లో భాగంగా రోజుకో ఉపాధ్యాయుడు అందుబాటులో ఉంటున్నట్లు తెలిసింది. పరీక్షలు సమీపిస్తున్నాయని, తరగతులు నిర్వహించేలా సర్కారు స్పందించాలని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎమ్మార్సీలకు తాళం

అధికారంలోకి రాగానే చాయ్ తాగినంత సేపట్లోనే సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామన్నా రేవంత్‌రెడ్డి.. ఏడాది పాలన పూర్తి చేసుకున్నా ఆ అంశంపై నోరుమెదపడం లేదంటూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. దీంతో ఆయా మండల విద్యా వనరుల కేంద్రాలన్నీ తాళాలతో దర్శనమిస్తున్నాయి. ఎమ్మార్సీలో ఉన్న ఉద్యోగులంతా సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులే కాగా, కార్యాలయాల తాళాలు తీసేవారే కరువయ్యారు.

సర్కారు దిగి వచ్చే వరకూ పోరాటం

ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీ నెరవేర్చే వరకూ పోరాటం చేస్తామని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా విధులు నిర్వహిస్తూ అద్భుత ఫలితాలుఉ సాధిస్తున్న తమను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రాపౌట్ పిల్లలకు విద్యనందిస్తూ వారిని ప్రయోజకులను చేస్తున్న తమపై చిన్నచూపు తగదని, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. సమ్మెకు ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటిస్తుండడం వల్ల సమ్మె మరింత ఉధృతంగా కొనసాగే అవకాశమున్నది.

తెరుచుకోని కోటపల్లి ఎమ్మార్సీ

డిమాండ్లు

- సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు, సిబ్బందిని రెగ్యులర్ చేయాలి. విద్యాశాఖలో విలీనం చేయాలి
- మహిళా ఉద్యోగులకు 180 రోజుల పాటు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి
- రూ.20 లక్షల జీవిత బీమాతో పాటు రూ.10 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలి
- ఉద్యోగాల భర్తీలో వెయిటేజ్ కల్పించాలి
- విరమణ ప్రయోజనాల కింద రూ.25 లక్షలు అందజేయాలి.

రెగ్యులర్ చేయాల్సిందే

కస్తూర్బా పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న మమ్ముల రెగ్యులర్ చేయాల్సిందే. చదువుమానేసి బడిబాట పట్టిన విద్యార్థుల సంక్షేమం కోసం కష్టపడుతున్నాం. పదో తరగతిలో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలు సాధిస్తున్నాం. ఇంత చేస్తున్నా ఇప్పటి వరకు మాకు తగిన గుర్తింపు లేదు. సర్కారు ఇకనైనా మా సమస్యలు పరిష్కరించాలి.

- అంతడుపుల సంధ్య, ఉపాధ్యాయురాలు, కేజీబీవీ, నీల్వాయి

డిమాండ్లు నెరవేర్చాలి

ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా మేము కూడా కష్టపడుతున్నాం. డ్రాపౌట్ విద్యార్థులను ప్రయోజకులను చేయడంలో కేజీబీవీల పాత్ర కీలకం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మమ్ముల్ని రెగ్యులర్ చేయాలి. డిమాండ్లన్నీ నెరవేర్చాలి. ప్రభుత్వ ఉపాధ్యాయులకు కల్పిస్తున్న సదుపాయాలన్నీ మాకూ కల్పించాలి. *- భారతి, ఉపాధ్యాయురాలు, కేజీబీవీ, జైపూర్*

హామీ నెరవేర్చే వరకూ పోరాటం

అధికారంలోకి రాగానే మాకిచ్చిన హామీని నెరవేర్చుతామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఏడాది పాలన పూర్తయ్యింది. కానీ ఇప్పటి వరకు మా గురించి పట్టించుకోలేదు. హామీ నెరవేరే వరకూ పోరాటం ఆపేది లేదు. విద్యాశాఖలో కీలకంగా ఉన్న మా ఇబ్బందులను సర్కారు గుర్తించాలి. వెంటనే రెగ్యులర్ చేసి ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు కల్పించాలి.

- సంపత్, సీఆర్పీ, కోటపల్లి

మందమర్రి నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్తున్న కురుమ సంఘం నాయకులు, సభ్యులు.

ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధన సాధ్యం

మందమర్రి, డిసెంబర్ 14: కురుమ సామాజిక వర్గ ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధన సాధ్యమవుతుందని కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుంట శ్రీశైలం అన్నారు. హైదరాబాద్‌లో దొడ్డి కొమరయ్య భవన నిర్మాణ పనుల ప్రారంభం సందర్భంగా కోకాపేటలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎగ్గేటి మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభలో పాల్గొనేందుకు శనివారం మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల ఆవరణ నుంచి కురుమ సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ కుర్మలంతా ఏకతాటి పై ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సమ్మెకు మద్దతు తెలిపిన ఉపాధ్యాయ సంఘాలు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 14 : సమస్యలు పరిష్కరించి.. రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు ఆసిఫాబాద్‌లో చేపట్టిన సమ్మె శనివారం ఐదో రోజుకు చేరుకున్నది. పీఆర్‌టీయూటీఎస్ సంఘ సభ్యులు శ్రీనివాస్, అనిల్‌కుమార్, ఎస్టీయూ సంఘ సభ్యులు తుకరాం, మానిక్‌రావు, సంజయ్, లక్ష్మణ్, టీఎస్‌యూటీఎఫ్ సంఘ సభ్యులు ఊషన్న, రాజకమలాకర్ రెడ్డి, రమేశ్, హేమంత్ షిండే, టీజీజేఎల్‌పీ 475 అసోషయేషన్ సభ్యులు శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, బాలకిషన్ మద్దతు తెలిపారు. ఉద్యోగుల సంఘం నాయకులు శృతిక, తుకారం, నాగ సుధ, నగేశ్, సంతోష్, సందీప్, నలంద, అరుణ, సుమలత, మోహన్, వెంకటరమణ, సత్యనారాయణ, పవన్ ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- గురుకులాల బాటతోనే కామన్ మెనూ ప్రారంభం
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 14 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ పాఠశాల, గిరిజన, మైనార్టీ, బీసీ గురుకులాలు సంక్షేమ వసతి గృహాల్లో కామన్ మెనూ ప్రారంభోత్సవాన్ని ప్రిన్సిపాళ్లు, అధికారులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, విద్యార్థి నాయకులు చేపట్టిన గురుకులాల బాట కార్యక్రమం ఫలితంగానే 'కామన్ డైట్' కార్యరూపం దాల్చిందన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యాదగిరి, భద్రయ్య, శారద, బీఆర్ఎస్ నాయకులు, జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

లక్షెట్టిపేటలో..

లక్షెట్టిపేట, డిసెంబర్14 : పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో శనివారం కామన్ డైట్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పీఎస్సార్, కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పట్టణంలోని దవాఖాన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దవాఖాన వైద్యులు ఆకుల శ్రీనివాస్, సురేశ్, పవిత్ర, కృష్ణతో పాటు గురుకులం ప్రిన్సిపాల్ రమాకళ్యాణి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆరీఫ్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

నస్పూర్, డిసెంబర్ 14 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేస్తున్న దీక్షకు శనివారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. వేతనాలను పెంచాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర శిక్షా ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

66 ఎస్టీ ఆవాసాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా

మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ఇంజినీర్ వీ.గంగాధర్

దండేపల్లి, డిసెంబర్14 : మంచిర్యాల సర్కిల్ పరిధిలో ఎస్టీఎస్‌డీఎఫ్ నిధుల కింద ఇప్పటి వరకు 66 ఎస్టీ ఆవాసాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేశామని సూపరింటెండెంట్ ఇంజినీర్ వీ.గంగాధర్ తెలిపారు. దండేపల్లి మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. ఇందులో ప్రతిపాదించిన 72 ఎస్టీ ఆవాసాలకు 66 పూర్తి చేశామని, మిగతావాటికి అటవీశాఖ నుంచి ఆమోదం పొందాల్సి ఉందన్నారు. ఎస్‌పీడీసీఎల్ గిరిజన పల్లెల్లో 100 శాతం విద్యుద్ధీకరణ పూర్తి చేయడానికి అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఎస్టీ ఆవాసాలకు విద్యుత్ శాఖ పెద్దపీట వేసిందన్నారు. విద్యుత్ లైన్‌లు వేయలేని చోట సోలార్ విద్యుత్ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ ప్రభాకర్ ఉన్నారు.

పగలూ ఇగమే

- బేలలో 6.2, సిర్పూర్(యూ)లో 6.7 డిగ్రీల సెల్సియస్
- రాష్ట్రంలోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు

ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో శనివారం అత్యల్పంగా 6.2, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 6.7 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకాగా, చలికి ప్రజలు గజగజ వణికిపోయారు. ఉదయం పదింటి దాకా పొగమంచు తొలగలేదు. సాయంత్రం ఆరింటికే చలి తీవ్రత పెరగగా, వివిధ పనులపై బయటకు వెళ్లిన వారంతా ఇళ్లకు చేరుకున్నారు. ఇక కొన్ని చోట్ల పగటి వేళ కూడా చలిమంటలు వేసుకొని ఉపశమనం పొందారు.

- బేల/సిర్పూర్(యూ), డిసెంబర్ 14

సిర్పూర్(యూ)లో చలి మంట కాగుతున్న స్థానికులు

గ్రూపు-2 పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

నేడు గ్రూప్ 2 పరీక్ష

నస్పూర్, డిసెంబరు 14 : జిల్లాలో ఆది, సోమవారాల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనుండగా, ఇందుకోసం 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 14,951 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. శుక్రవారం సాయంత్రమే పరీక్షల సామగ్రి స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకున్నాయి. ఎగ్జామ్ సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనున్నది. చీఫ్ సూపరింటెండెంట్‌లు 48 మంది, అబ్జర్వర్లు 48 మంది, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు 48 మందిని నియమించారు.

అభ్యర్థులకు సౌకర్యాలు కల్పించాలి

కాగజ్‌నగర్, డిసెంబర్ 14: గ్రూపు-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారిటీలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయగా, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం పట్టణంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఆపై స్థానిక విద్యాలయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లాలో 48 కేంద్రాలు

క్షకు హాజరయ్యే అభ్యర్థులకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారిటీలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయగా, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం పట్టణంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఆపై స్థానిక విద్యాలయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య పాల్గొన్నారు.